# విఘ్నేశ్వరుడి ఆశీస్సులు సకల మానవాళికి స్ఫూర్తిదాయకం

**- గణేష్ శోభాయాత్రలో కొత్వాల నృత్యాలు**



**పాల్వంచ, సెప్టెంబర్ 25 (తెలంగాణ వాణి):**
గణేష్ నిమజ్జనం సందర్భంగా పాల్వంచ పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన శోభాయాత్రల్లో డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు నృత్యాలు చేసి భక్తులను అలరించారు. బీసీఎం రోడ్డు, పాత పాల్వంచ ఆర్టీ కాలనీలో జరిగిన శోభాయాత్రల్లో కొత్వాల శ్రీనివాసరావుతో పాటు ఆయన సతీమణి, 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి కూడా నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ గణేశుడిని పూజించడం పూర్వజన్మ సుకృతమని, విఘ్నేశ్వరుడి ఆశీస్సులు సకల మానవాళికి స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమాల్లో చింతా నాగరాజు, చిన్న పండు, మస్తాన్, సాగర్, బోగిని శ్రీను, బోగిని సందీప్, ఫోటో బాబీ పాల్గొన్నారు.

# అక్షర సముద్రం... ఆపన్నులకు విద్యాసాగరం!

**- సెప్టెంబరు 26న ఈశ్వర చంద్ర విద్యాసాగర్ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం**

ఒక చిన్న దీపం వెలిగితే ఒక గది మాత్రమే కనిపిస్తుంది. కానీ ఒక మనిషి చేతిలో అక్షరం వెలిగితే... ఒక కుటుంబం, ఒక తరం, చివరకు ఒక సమాజం మారుతుంది. 19వ శతాబ్దపు బెంగాల్‌లో అలాంటి అక్షరదీపంగా నిలిచిన మహనీయుడు ఈశ్వర చంద్ర విద్యాసాగర్.

1820 సెప్టెంబరు 26న బీర్సింఘా గ్రామంలో పేద బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన ఆయన బాల్యం సౌకర్యాల మధ్య సాగలేదు. చదువుకోవాలనే తపన మాత్రం అపారంగా ఉండేది. చిన్న వయసులోనే కలకత్తాకు చేరి సంస్కృత కళాశాలలో విద్యాభ్యాసం ప్రారంభించారు. సంస్కృత వ్యాకరణం నుంచి తత్వశాస్త్రం వరకు అనేక శాస్త్రాల్లో అసాధారణ పాండిత్యాన్ని సంపాదించారు. ఆ ప్రతిభకే 'విద్యాసాగర్' --- అంటే 'విద్యా సముద్రం' అనే గౌరవం లభించింది.

**పాండిత్యం... ప్రజల కోసం**

విద్యాసాగర్ కేవలం పండితుడిగా మిగిలిపోలేదు. 1841లో ఫోర్ట్ విలియం కాలేజీలో హెడ్ పండిట్‌గా పనిచేశారు. 'బేతాళ పంచవింశతి' వంటి రచనలతో పాటు సంస్కృత గ్రంథాలను సులభమైన బెంగాలీ భాషలో అందించారు. బెంగాలీ గద్యాన్ని సాధారణ ప్రజలకు మరింత చేరువ చేయడంలో ఆయన పాత్ర విశేషమైనది.

1851లో సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడు విద్యా వ్యవస్థలో మార్పులకు శ్రీకారం చుట్టారు. క్రమశిక్షణతో పాటు ఆధునిక విద్యా విధానాలకు ప్రాధాన్యం ఇచ్చారు. తరువాత పాఠశాలల ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి గ్రామీణ ప్రాంతాల్లోనూ విద్య విస్తరణకు కృషి చేశారు.

ఆయన ఆలోచన స్పష్టమైనది – విద్య కొద్దిమందికి ప్రత్యేక హక్కు కాదు; ప్రతి ఒక్కరికీ అవకాశంగా ఉండాలి.

**అమ్మాయి చదివితే... సమాజం చదివినట్టే!**

ఆ కాలంలో బాలికల విద్యపై అనేక సామాజిక ఆంక్షలు ఉండేవి. అలాంటి పరిస్థితుల్లో విద్యాసాగర్ బాలికల కోసం పాఠశాలల ఏర్పాటుకు కృషి చేశారు. బెంగాల్‌లో దాదాపు 35 బాలికల పాఠశాలల స్థాపన, నిర్వహణలో ఆయన కీలక పాత్ర పోషించారు. బెథూన్ స్కూల్ నిర్వహణలోనూ ఆయన ముఖ్యమైన బాధ్యతలు చేపట్టారు.ఒక బాలిక చేతిలో పుస్తకం పెట్టడం అంటే కేవలం ఆమెకు అక్షరాలు నేర్పడం కాదని ఆయన చూపించారు. అది కుటుంబంలో ఆలోచనకు, సమాజంలో మార్పుకు తలుపు తెరవడం.

వితంతువు కన్నీటికి సమాజం సమాధానం చెప్పాలి

సమాజంలోని అత్యంత కఠినమైన సమస్యల్లో ఒకటైన వితంతు పునర్వివాహం కోసం విద్యాసాగర్ తీవ్రంగా పోరాడారు. హిందూ ధర్మశాస్త్రాలను లోతుగా అధ్యయనం చేసి, ముఖ్యంగా పరాశర స్మృతి ఆధారంగా వితంతు పునర్వివాహానికి శాస్త్రసమ్మతి ఉందని వాదించారు.వ్యతిరేకతలు, విమర్శలు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. 987 మంది సంతకాలతో సమర్పించిన పిటిషన్ సహా ప్రజా ఉద్యమం, చర్చల నేపథ్యంలో 1856లో హిందూ వితంతు పునర్వివాహ చట్టం అమలులోకి వచ్చింది.

చట్టం వచ్చిన తర్వాత కూడా ఆయన మాటలకే పరిమితం కాలేదు. తన కుమారుడు నారాయణ చంద్రుడి వివాహాన్ని వితంతువుతో జరిపించి, సంస్కరణ అంటే ముందుగా మన జీవితంలో ఆచరించాల్సిందే అని చూపించారు.బాల్యవివాహం, బహుభార్యాత్వం వంటి ఆచారాలపైనా ఆయన విమర్శనాత్మకంగా స్పందించారు.

దయకు కూడా ఒక భాష ఉంటుంది

విద్యాసాగర్ పాండిత్యం ఎంత గొప్పదో, ఆయన మానవత్వం అంతకంటే గొప్పది.

పేదలు, వితంతువులు, నిరుపేద కుటుంబాలకు సహాయం చేయడమే కాకుండా సామాజిక భద్రత కోసం ఏర్పాటైన కార్యక్రమాలతోనూ ఆయన అనుబంధమయ్యారు. 'హిందూ ఫ్యామిలీ యాన్యుటీ ఫండ్' వంటి సంస్థల ద్వారా అవసరమైనవారికి ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేశారు.

మెట్రోపాలిటన్ ఇన్‌స్టిట్యూషన్ అభివృద్ధిలోనూ కీలక పాత్ర పోషించారు. విద్యాసంస్థ అనేది గోడలు, తరగతి గదులు మాత్రమే కాదు – సమాజాన్ని తీర్చిదిద్దే వేదిక అని ఆయన ఆచరణలో చూపించారు.

జీవితపు చివరి దశలో కర్మటార్ ప్రాంతంలో నివసిస్తూ అక్కడి గిరిజన ప్రజలతో సన్నిహితంగా మెలిగారు. పేదలకు మందులు, ఆహారం, విద్య విషయంలో తన వంతు సహాయం అందించారు.1891 జూలై 29న ఆయన భౌతికంగా దూరమైనా, ఆయన ఆలోచనలకు మరణం లేదు.

**నేటి తరానికి విద్యాసాగర్ సందేశం**

నేడు మన చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంది. ప్రపంచ జ్ఞానం క్షణాల్లో మన ముందు ఉంటుంది. కానీ మన చుట్టూ ఉన్న అన్యాయాన్ని చూడకుండా కేవలం సమాచారాన్ని సేకరించడం విద్య కాదు.

ప్రశ్నించాలి. ఆలోచించాలి. నేర్చుకోవాలి. అవసరమైన చోట స్పందించాలి.
ఈ నాలుగు విలువలే విద్యాసాగర్ జీవితం మనకు నేర్పే గొప్ప పాఠం.
ఆయన అక్షరాలను బోధించాడు.
ఆ అక్షరాలతో సమాజాన్ని ప్రశ్నించాడు.
ఆ ప్రశ్నలతో సంస్కరణలకు బాట వేశాడు.
ఆ సంస్కరణలను తన జీవితంతో ఆచరించాడు.
అందుకే ఈశ్వర చంద్ర విద్యాసాగర్ పేరు ఒక చరిత్ర పుటలో ఆగిపోయిన పేరు కాదు.
అది ప్రతి తరం చదవాల్సిన ఒక పాఠం...
ప్రతి మనిషి ఆచరించాల్సిన ఒక విలువ...
అక్షరం మనిషిని మాత్రమే కాదు, సమాజాన్ని కూడా మార్చగలదనే ఒక శాశ్వత సత్యం.

వ్యాసకర్త
జి. శ్రీదేవి

# తుఫాన్ దెబ్బకు దంతెలబోర ఎస్సీ కాలనీ అతలాకుతలం

**- ప్రభుత్వ పరంగా ఆదుకునేలా చర్యలు తీసుకుంటాం : కొత్వాల**





**పాల్వంచ, సెప్టెంబర్ 25 (తెలంగాణ వాణి):**
తుఫాన్ కారణంగా ఇళ్లు కూలిపోయి తీవ్రంగా నష్టపోయిన దంతెలబోర ఎస్సీ కాలనీ బాధితులను ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు తీసుకుంటామని పాల్వంచ సొసైటీ ఛైర్మన్, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి కాలనీలో పర్యటించిన కొత్వాల.. పూర్తిగా కూలిపోయిన ఆరు ఇళ్లు, పాక్షికంగా దెబ్బతిన్న 36 ఇళ్లను పరిశీలించారు. నష్ట వివరాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ, విద్యుత్, వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలపై చర్చించారు. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న బెండ తోటను, విరిగిన చెట్లను వ్యవసాయ శాఖ అధికారి శంభోశంకర్‌తో కలిసి పరిశీలించారు. ఈ నష్టాన్ని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లి బాధితులకు సహాయం అందేలా చర్యలు చేపడతామని కొత్వాల పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జాలె జానకిరెడ్డి, యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్నగౌడ్, సర్పంచ్ కందుల వెంకటరమణ, కార్యదర్శి అరుణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న బెటాలియన్ పోలీసులు

**రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఉపాధ్యాయుడికి తక్షణ సహాయం**



**లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 25 (తెలంగాణ వాణి)**
చాతకొండ సమీపంలో శుక్రవారం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడిని లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళ్తున్న 6వ బెటాలియన్ పోలీసు సిబ్బంది వెంటనే స్పందించి ప్రథమ చికిత్స అందించారు.విషయాన్ని కమాండెంట్ పి.సి.వి. రమణ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే బెటాలియన్ అంబులెన్స్‌ను పంపించారు. గాయపడిన ఉపాధ్యాయుడిని కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించిన బెటాలియన్ సిబ్బందిని కమాండెంట్ అభినందించారు.

# భక్తిశ్రద్ధలతో గణనాథుడి నిమజ్జన వేడుకలు

**- డప్పులు, నృత్యాలతో అలరించిన భక్తులు**

**- కొత్తగూడెంలో వైభవంగా వినాయక శోభాయాత్ర**

**- పాల్గొన్న మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, వనమా రాఘవ**





**కొత్తగూడెం, సెప్టెంబర్ 25 (తెలంగాణ వాణి):**
గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా కొత్తగూడెం పట్టణంలో వినాయక నిమజ్జన శోభాయాత్రలు శుక్రవారం వైభవంగా సాగాయి. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి గణనాథుల విగ్రహాలను ప్రత్యేక వాహనాలపై ఊరేగింపుగా తీసుకువచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో గణనాథుడికి వీడ్కోలు పలికారు. డప్పుల మోతలు, భక్తిగీతాలు, నృత్యాలతో శోభాయాత్రలు సందడిగా సాగాయి. యువత, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని గణేశుడి నామస్మరణతో పట్టణాన్ని మార్మోగించారు. పలుచోట్ల భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులు ఇచ్చారు. కొత్తగూడెం సూపర్ బజార్ సెంటర్ లో ఏర్పాటు చేసిన శోభాయాత్ర ఆహ్వాన వేదిక వద్ద మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు పాల్గొని గణనాథుడికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులతో కలిసి కొద్దిసేపు శోభాయాత్రలో పాల్గొన్నారు. గణేశుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. బిఆర్ఎస్ నాయకులు వనమా రాఘవ భక్తులతో కలిసి కోలాటం ఆడారు. నిమజ్జన సందర్భంగా సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తగా వినాయకుడిని గంగమ్మ ఒడిలోకి చేర్చాలని ఆయన కోరారు. భక్తి, సామాజిక ఐక్యతకు ప్రతీకగా సాగిన వినాయక శోభాయాత్రలు కొత్తగూడెం పట్టణంలో పండుగ వాతావరణాన్ని నింపిందని గణనాయకుడి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలన్నారు.

# శాస్త్రీయ పద్ధతిలో కులగణన చేపట్టాలి




**ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ కేటాయించాలి: డాక్టర్ పరికిపండ్ల అశోక్**

**కొత్తగూడెం, సెప్టెంబర్ 25 (తెలంగాణ వాణి):**
2027 జనగణనలో కుల గణనను శాస్త్రీయంగా, పారదర్శకంగా నిర్వహించాలని బీసీ దళపతి డాక్టర్ పరికిపండ్ల అశోక్ డిమాండ్ చేశారు. ప్రతి కులానికి ప్రత్యేక ప్రామాణిక కోడ్ కేటాయించి, డిజిటల్ డ్రాప్‌డౌన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కొత్తగూడెంలోని ఓ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన బీసీ చైతన్య కార్యక్రమంలో 'జనగణనలో ఓపెన్ కాస్ట్ కాలమ్--క్లోజ్డ్ జస్టిస్' అంశంపై ఆయన మాట్లాడారు. 2027 జనగణనకు సంబంధించిన ప్రశ్నావళిలో ఓబీసీలకు స్పష్టమైన గుర్తింపు ఉండేలా మార్పులు చేయాలని సూచించారు. ఒకే కులం వివిధ పేర్లు, పర్యాయపదాలు, ప్రాంతీయ పేర్లతో నమోదు అయితే భవిష్యత్ డేటాలో గందరగోళం ఏర్పడే అవకాశం ఉందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద ఉన్న బీసీ, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కులాల జాబితాలను సమగ్రంగా రూపొందించి ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎన్యూమరేటర్లకు ముందుగానే సాంకేతిక శిక్షణ ఇవ్వడంతో పాటు డేటా ధ్రువీకరణకు పటిష్టమైన వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు టి. మురళీధర్ స్వామి మాట్లాడుతూ కులాల జాబితాతో కూడిన డ్రాప్‌డౌన్ విధానాన్ని ప్రశ్నావళిలో చేర్చాలని అన్నారు. కులగణనకు సంబంధించిన అంశాలపై బీసీ సంఘాలు, నాయకులు ప్రజల్లో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకులు వలపుదాసు భద్రయ్య, దూదేకుల సంఘం రాష్ట్ర నాయకుడు జావేద్, ఆదివాసీ నాయకుడు కొమరం వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ నాయకుడు గోడ్ల మోహన్‌రావు, గిరిజన నాయకుడు సాంబ, యాదవ సంఘం నాయకులు కోదాడ శ్రీనివాస్, సాయిబాబు, వడ్డెర సంఘం నాయకుడు బండారు నాగేశ్వరరావు, పెరిక సంఘం నాయకులు బొలిశెట్టి రంగారావు, శ్రీనివాసరావు, నల్లపు రవీంద్ర, కాపు సంఘం నాయకులు పుచ్చకాయల సాంబశివరావు, కుమ్మరి సంఘం నాయకుడు ఫాల్గుణ, పద్మశాలి నాయకులు బిర్రు నరసింహారావు, ఇమంది ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.